క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



క్లాత్ బ్యాగులు పంపిణీ చేస్తున్న మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక కరణంగారి సెంటర్‌లో ఉన్న గీతం పాఠశాల విద్యార్థులు ఆదివారం క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. భానుగుడి సెంటర్‌లో ఈ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రకృతిని కాపాడుకోవడంలో అంతా సమష్టిగా సాగాలన్నారు. అనంతరం 1,500 క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేసి, ప్లాస్టిక్ బ్యాగ్‌ల వాడడంతో కలిగే అనర్థాలను ప్రజలకు విద్యార్థులు వివరించారు. కార్యక్రమంలో గీతం పాఠశాల కరస్పాండెంట్ సుజ్ఞాన్, ప్రిన్సిపాల్ సురభి శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు, తహసీల్దార్ సీతాపతిరావు

కాకినాడ: నగరంలోని పలు పోలింగ్ కేంద్రాలను నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదివారం పరిశీలించారు. కొన్ని పోలింగ్ కేంద్రాలు శిథిలావస్థకు చేరడంతో కొత్తవి ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదించారు. ఆ మేరకు గాంధీనగర్, పోర్టు ఏరియా, గాంధీ సెయింటనరీ, జగన్నాథపురం శివాలయం ప్రాంతాల్లోని ప్రతిపాదిత కేంద్రాలను కమిషనర్ పరిశీలించారు. అక్కడ సదుపాయాలు, సౌకర్యాల కల్పనపై ఆరా తీశారు. అధికారులు, సిబ్బందికి ఆయన సూచనలు ఇచ్చారు. డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, తహసీల్దార్ సీతాపతిరావు, ఎలక్షన్ డీటీ మురళీకృష్ణ, డిప్యూటీ సిటీ ప్లానర్ రాంబాబు, డీసీపీ నాగశాస్త్రులు తదితరులు ఉన్నారు.

ఎవరికి వారే అన్నట్టు..

కరప: మాజీ సీఎం చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ ఆదివారం మండలంలో టీడీపీ నాయకులు చేపట్టిన నిరసన శిబిరాల్లోనూ విభేదాలు స్పష్టంగా కనిపించాయి. మండలంలో ఆ పార్టీ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి నిరసన దీక్షలు చేశారు. నడకుదురులో టీడీపీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి తదితరులు ఒకవర్గంగా, కరపలో మండల పార్టీ అధ్యక్షుడు దేవు వెంకటేశ్వరరావు, చోడాబత్తుల రాజశేఖర్ తదితరులు మరోవర్గంగా దీక్షా శిబిరాలు ఏర్పాటు చేశారు.

కరపలో క్రికెట్ పోటీలు

కరప: స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం సానా సతీష్‌బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఈ పోటీలను జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నురికుర్తి వెంకటేశ్వరరావు ఆదివారం ప్రారంభించారు. వినాయక చవితి సందర్భంగా ఈ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆనంద్ న్యూటన్, మురళి, సుందర శ్రీనివాస్, ముమ్మిడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నవరాత్ర ఉత్సవాలు

కాకినాడ కల్చరల్: స్థానిక రామారావు పేటలోని శ్రీవేణుగోపాల సంస్కృత ప్రచార సభ సమావేశ మందిరంలో ప్రచార సభ ఆధ్వర్యంలో సోమవారం నుంచి 26వ తేదీ వరకూ గణపతి నవరాత్ర ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని సభ సంయుక్త కార్యదర్శి చింతపల్లి సుబ్బారావు ఆదివారం తెలిపారు. శ్రీకాళహస్తి మహత్యం, తిక్కన భారతం, ఆదిత్య హృదయం, రఘువంశ మహాకావ్యం, రామాయణం తదితర అంశాలపై సాహిత్య సదస్సులు నిర్వహిస్తామని చింతపల్లి తెలిపారు. సాహితీ అభిమానులు, కళాభిమానులు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగిన దీక్షలు

కాకినాడ సిటీ: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పలివెల నవీన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్ వద్ద చేపట్టిన రిలే నిరసన దీక్షలు కొనసాగాయి. ఎమ్మార్పీస్ నాయకులు దూపల్లి కృష్ణ, మిరియాల కుమార్, నూకరాజు పాల్గొన్నారు.

ధన్వంతరి జయంతి

బోట్‌క్లబ్: ధన్వంతరి జయంతి సందర్భంగా స్థానిక గొడారిగుంట జర్నలిస్ట్ కాలనీలో రమా సహిత సత్యదేవ మందిరంలో ఆదివారం ధన్వంతరి హోమం జరిగింది. మధ్వ పురోహితుడు యాతగిరి మధ్వేష్ ఆధ్వర్యంలో హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మ తీర్థ స్వామీజీ అనుగ్రహంతో ఈ విశేష కార్యక్రమాన్ని భక్తుల సహకారంతో నిర్వహించామన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ధన్వంతరి అనుగ్రహం ఎంతో అవసరమన్నారు.

మనసును కదిలించిన ఘటనలెన్నో..

- గడప గడపకూ కార్యక్రమంపై సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- ప్రజలతో మమేకమవ్వడం అదృష్టం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: సాంకేతిక పరమైన ఇబ్బందులతో పింఛన్లు దక్కని అభాగ్యులు.. పూటగడవక అల్లాడే నిరుపేదలు.. ఆరోగ్య సమస్యలతో మందులకు డబ్బులు లేక సతమతమయ్యే జనం ఇలా హృదయాన్ని కదిలించే ఎన్నో సంఘటనలను గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్వయంగా చూశానని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అన్నారు. కొన్ని ఘటనలు కంటతడి పెట్టించాయని తెలిపారు. వీటి పరిష్కారానికి చర్యలు చేపట్టడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన తన 200 రోజుల గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎదురైన అనుభవాలను పాత్రికేయులతో పంచుకున్నారు. ప్రతి గడపకూ వెళ్లి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించే లక్ష్యంతో సీఎం జగన్ ప్రతిపాదించిన గడప గడపకూ ప్రభుత్వం అడుగడుగునా మనస్సును హత్తుకునేలా, ప్రజలకు ధైర్యం చెప్పేలా సాగిందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజలతో బాధలు, కష్టసుఖాలను పంచుకునే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు.

- కరోనా కారణంగా కుటుంబ పెద్దలను కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న కొన్ని కుటుంబాల పిల్లలను విద్యాపరంగా దత్తత తీసుకుని చదివిస్తున్నానన్నారు.
- గర్భిణిగా ఉన్న ఓ టీడీపీ కార్యకర్త పనికి వెళ్లలేక పూట గడవడానికి ఇబ్బంది పడుతున్న స్థితిలో ఉండగా ఆమెకు డెలివరీ అయ్యే వరకూ దఫదఫాలుగా రూ.70 వేల సహాయం అందించానన్నారు.
- సమర్థవంతంగా పనిచేసే ఓ వలంటీర్ మరణిస్తే ఆమె ఇద్దరి పిల్లల పేరున వ్యక్తిగతంగా రూ. 1.25 లక్షలు ఆర్థిక సహాయం అందించి భర్తకు ఔట్ సోర్సింగ్‌లో ఉద్యోగాన్ని కల్పించామన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

గడప గడపకూ మన ప్రభుత్వంలో 42 డివిజన్లు 84 సచివాలయాల పరిధిలో సుమారు 120 అభివృద్ధి పనులకు సంబంధించి రూ.25 కోట్ల పనులు చేపట్టామని ఎమ్మెల్యే వివరించారు. సచివాలయ భవనాలు, కమ్యూనిటీ హాల్స్ వంటి పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ప్రతి సచివాలయ పరిధికి ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించిందని, వీటి ద్వారా రూ. 16 కోట్లతో అనేక పనులు చేపట్టగా, తుది దశకు చేరుకున్నాయన్నారు. డిసెంబర్ చివరి నాటికల్లా రోడ్లు, డ్రైన్లు, వీధి దీపాల వంటి అన్ని మౌలిక సదుపాయాలు పూర్తి చేస్తామన్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి 'విన్నాం-చూశాం-చేశాం' పేరుతో మరోసారి ప్రజల్లోకి వచ్చేందుకు సిద్ధమవుతున్నామన్నారు.

పేదలకు అండగా..

సాంకేతిక పరమైన ఇబ్బందులతో ప్రభుత్వ పరంగా సహాయం అందించలేని ఎంతో మందికి దాతల సహకారం, సొంత నిధులు వెచ్చించి సహాయం చేసినట్లు ఎమ్మెల్యే ద్వారంపూడి వెల్లడించారు. ఎంతో మంది వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు సొంతంగా పించన్లు ఇస్తున్నానన్నారు. సుమారు 20 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లు ఇప్పించానన్నారు. ఎంతో మంది ఒంటరి జీవితం గడిపేవారికి రేషన్‌కార్డులు ఇప్పించడం, ఆరోగ్యశ్రీ లేని వారికి **కార్డులు మంజూరు చేయడం, దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు సమకూర్చడం వంటి ఎన్నో సేవలను అందించానన్నారు.**

విద్యార్థుల కోసం బస్సులు

నాలుగు డివిజన్లలో నివసించే 550 మంది పేద పిల్లలు పాఠశాలలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని నాలుగు ఉచిత బస్సులను ఏర్పాటు చేసినట్టు చంద్రశేఖరరెడ్డి చెప్పారు. నిరుద్యోగ యువత కోసం జాబ్ మేళా ఏర్పాటు చేసి సుమారు 2,200 మందికి ఉద్యోగాలు కల్పించానన్నారు. అసాంఘిక కార్యకలాపాలను గుర్తించి అరికట్టేందుకు దుమ్ములపేట ప్రాంతంలో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసి సచివాలయానికి అనుసంధానం చేశామన్నారు. ఇక ఇరుకు సందుల్లోకి వెళ్లలేని ప్రాంతాల ప్రజల కోసం సోలార్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజల విజ్ఞప్తి మేరకు అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఇవన్నీ గడప గడపకూ మన ప్రభుత్వంలో స్వయంగా ప్రజల మధ్యకు వెళ్లి వారి కష్టాలను చూడడం వల్లే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు మాజీ కార్పొరేటర్లు ఉన్నారు.

గురువులపై భక్తిభావం కలిగి ఉండాలి



సభలో ప్రసంగిస్తున్న సాహితీవేత్త జోస్యుల కృష్ణబాబు తదితరులు

కాకినాడ కల్చరల్: గురువులపై భక్తిభావం కలిగి ఉండాలని సాహితీవేత్త డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా జగన్నాథ శర్మ కల్యాణ మండపంలో ఆస్వాదన సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆదివారం పోతన భాగవతంపై ఉపన్యాసం జరిగింది. భాగవతంలోని షష్ఠమ స్కంధం నుంచి అమృత తుల్యమైన పద్యాలను జోస్యుల రాగయుక్తంగా ఆలపించి వాటి భావాలను వివరించారు. గురువును నిర్లక్ష్యంగా చూస్తే ఎంతటి ఉన్నత స్థానంలో ఉన్నవాడైనా పతనమవుతాడని ఆయన తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సమితి అధ్యక్షుడు గొట్టిముక్కల వెంకట సత్యనరసింహశాస్త్రి మాట్లాడుతూ భాగవతం మనిషిని సంస్కారిగా తీర్చిదిద్దడానికి దోహదపడుతుందన్నారు. సమితి ఉపాధ్యక్షులు కారుప్రోలు గౌరినాయుడు, మార్ని జానకీరామ్‌చౌదరి, డాక్టర్ పొన్నపల్లి శ్రీరామారావు, చింతపల్లి సుబ్బారావు, అనురాధ, సిరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజలకు అండగా ప్రభుత్వం

- మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపిద్దాం
- మంత్రి వేణు, ఎమ్మెల్యే ద్వారంపూడి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వేణు, చిత్రంలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ సిటీ: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం శెట్టిబలిజ సామాజిక వర్గానికి అండగా ఉంటుందని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని తిరిగి ఎన్నుకుందామని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. పితాని శ్రీనివాసరావు పోక్సో కోర్టు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా కాకినాడ సూర్యకళా మందిరంలో నిర్వహించిన సిటీ శెట్టిబలిజ కుటుంబాల ఆత్మీయ సమ్మేళన సభలో వారు పాల్గొని మాట్లాడారు. మంత్రి వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ తాను ఇదే సామాజిక వర్గం నుంచి రాజకీయ రంగంలో అడుగుపెట్టానని తనను, తన సామాజిక వర్గాన్ని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి గుర్తించి అప్పట్లో జిల్లా పరిషత్ చైర్మన్ పదవితో పాటు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎంపిక చేశారన్నారు. ఈ ఎంపికలో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రధాన పాత్ర పోషించారని మంత్రి వేణు వివరించారు. నాటి నుంచి ద్వారంపూడితో స్నేహం కొనసాగుతుందన్నారు. ఉభయ గోదావరి జిల్లాల్లో శెట్టిబలిజ సామాజిక వర్గీయులు బలపరిచిన పార్టీలే విజయం సాధించడంలో ప్రధాన పాత్ర వస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ శెట్టిబలిజలు డబ్బులు ఆశించరని, గౌరవాన్ని మాత్రమే కోరుకుంటారన్నారు. పితాని శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారంలో తన ఒంటిపై నల్లకోటు వేసుకుని తిరగడాన్ని గ్రహించానని, అందుకే ఆయనకు సముచిత స్థానం కల్పించాలని ఆనాడే నిర్ణయించుకున్నానన్నారు. అనుకోకుండా పితాని శ్రీనివాసరావుకు పోక్సో కోర్టు స్పెషల్ పీపీగా అవకాశం వచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. పోక్సో కోర్టు పీపీగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తవుతుందన్నందున శెట్టిబలిజ కులస్తులు పితాని శ్రీనివాసరావును సత్కరించారు. అనంతరం పితాని ఆధ్వర్యంలో మంత్రి వేణుగోపాలకృష్ణ, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలను శెట్టిబలిజ కులస్తులు, పెద్దలు, నాయకులు ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, శెట్టిబలిజ నేతలు వాసంశెట్టి రాజేశ్వరరావు, మర్రిపూడి రమణ, వాసంశెట్టి సత్య, కందూరు అప్పలనాయుడు, గీసాల భాస్కర్, పితాని సోమన్న, రాయుడు మురళి, బొందల నూకరాజు, కర్రి బాబ్జీ పాల్గొన్నారు.

ప్రచార జాతాను విజయవంతం చేయండి

కాకినాడ సిటీ: వచ్చే ఏడాది యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 24వ తేదీ నుంచి జరిగే ప్రచార జాతాను విజయవంతం చేయాలని ఆ కార్యవర్గం పిలుపునిచ్చింది. ఆదివారం స్థానిక యూటీఎఫ్ హోమ్‌లో జిల్లా అధ్యక్షుడు కేవీవీ నాగేశ్వరరావు అధ్యక్షతన జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యూటీఎఫ్ రజతోత్సవ సభలు 2000లో కాకినాడలో ఘనంగా నిర్వహించామన్నారు. 50 ఏళ్ల వేడుకలను కూడా కాకినాడ జిల్లాలో నిర్వహించడానికి కార్యకర్తలంతా సంసిద్ధులు కావాలని పిలుపునిచ్చారు. నాయకులు తోటకూర రవిచక్రవర్తి, టి.అన్నరాము, జి.ప్రభాకర వర్మ, పీవీఎన్ గనేశ్వరరావు, బి.నాగమణి, ఎంవీ సాయిరాం, సీహెచ్ సూరిబాబు, టి.సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- పార్టీలోకి భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, జెడ్పీటీసీ రామకృష్ణ

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేదల సంక్షేమానికి బాటలు పడ్డాయని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ ఆధ్వర్యంలో వలసపాకల పరిధి సుందరయ్య కాలనీలోని ప్రజలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం రమణయ్యపేటలోని వైద్యనగర్ క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కన్నబాబు మాట్లాడుతూ వలసపాకల సుందరయ్య కాలనీ నుంచి పెద్దలంతా వైఎస్సార్ సీపీలో చేరడం అభినందనీయమన్నారు. సుందరయ్య కాలనీ వాసులను అక్కడి నుంచి తరలించాలని చాలా ప్రయత్నాలు జరిగాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలనే దృఢ సంకల్పంతో సుందరయ్య కాలనీపై ఉన్న కేసులు తొలగించి మొత్తం అందరినీ ఒప్పించి బ్రహ్మాండమైన కాలనీ నిర్మించామన్నారు. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, విద్యుత్ ఏర్పాటు చేసి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. కాలనీ వాసులంతా దినసరి కూలీలని ఫ్యాక్టరీలు, ఇతర చోట్ల పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నారన్నారు. వీరందరికీ అండగా ఉంటామన్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ టీడీపీ, జనసేన, వామపక్షాలకు చెందిన వారు ఎమ్మెల్యే కురసాల కన్నబాబుపై నమ్మకంతో ఆయన అడుగు జాడల్లో నడిచేందుకు వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, రమణయ్యపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు గంజా సత్తిబాబు, గగారిన్, వాకలపూడి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వ కర్మ జయంతి



కలెక్టరేట్‌లో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న అధికారులు, వివిధ సంఘాల ప్రతినిధులు

కాకినాడ సిటీ: స్థానిక కలెక్టరేట్‌లోని వివేకానంద హాలులో విశ్వకర్మ జయంతిని బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ, బీసీ సంక్షేమ అధికారి ఎస్‌వీఎస్ సుబ్బలక్ష్మి విశ్వ బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులతో కలసి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విశ్వబ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు ఎ.ఉమాశంకర్, టి.దుర్గాప్రసాద్, ఎ.శ్రీనివాస్, సహాయ బీసీ సంక్షేమ అధికారి టీవీ ప్రసాద్, ఆ శాఖ సూపరింటెండెంట్ జి.సతీష్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం విశ్వకర్మ జయంతిని నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి ఆధ్యాత్మిక వేత్త రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, నగేష్, బాబూరావు తదితరులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ పౌరాణిక కాలపు ఇంజినీర్ విశ్వకర్మ అన్నారు. త్రిమూర్తులలో ఒకరైన బ్రహ్మదేవుని కుమారుడైన విశ్వకర్మ దేవతలకు కావాల్సిన నగరాలు, మేడలు, మిద్దెలు, రథాలు తయారు చేసి పౌరాణిక కాలపు ఇంజినీర్‌గా పూజలందుకున్నారన్నారు.

సర్పవరం జంక్షన్‌లోని ఇండస్ట్రియల్ ఏరియాలో విశ్వకర్మ జయంతిని గాయిత్రీ వడ్రంగి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు అనుమంచిపల్లి బ్రహ్మాజీ ఆధ్వర్యంలో విశ్వకర్మను పూజించారు. అనంతరం అన్నదానం చేశారు.

చేయూత అందించేందుకు చర్యలు



సేవలు అందించడానికి వెళుతున్న సభ్యులను అభినందిస్తున్న క్రైస్తవ సంఘ నాయకులు

నాగమల్లితోట జంక్షన్: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ కాకినాడ జిల్లా శాఖ నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన బృందం మణిపూర్, నాగాలాండ్ రాష్ట్రాల పర్యటనకు పయనమైందని ఆ శాఖ అధ్యక్షుడు రిక్కీ గూటం ఆదివారం తెలిపారు. ఈ రెండు రాష్ట్రాల్లో మందులు, గ్రోసరీ, సోలార్ ల్యాంప్స్, ఆహార పదార్థాలు యుద్ధం వల్ల నష్టపోయిన ప్రాంతాల్లో ఉచితంగా పంపిణీ చేయనున్నామన్నారు. ప్రభుత్వం తరఫున నిర్వహిస్తున్న పునరావాస కేంద్రాల్లో ఈ సేవలు అందిస్తామన్నారు. నాగాలాండ్, మణిపూర్ వెళుతున్న బృందంలో రిక్కీ గూటంతో పాటు స్టీవెన్ ఆనంద్, మోజెస్ బెన్నీ, సుధీర్, పాల్‌రాజ్ కమల్, అంకిత్‌రెడ్డి ఉన్నారు.

రామస్వామి నాయకర్‌కు నివాళి

కాకినాడ సిటీ: స్థానిక జెడ్పీ కూడలిలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం సామాజిక సాంస్కృతిక విప్లవ యోధుడు పెరియార్ రామస్వామి నాయకర్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాకినాడలో రామస్వామి నాయకర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పప్పు దుర్గాప్రసాద్, చొల్లంగి వేణుగోపాల్, అయితాబత్తుల రామేశ్వరరావు, రంబాల సతీష్, పిట్టా వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపయ్యనే పూజిద్దాం

- ప్రకృతికి ప్రణమిల్లుదాం
- డీఎస్పీ శ్రీనివాస్ పిలుపు



భానుగుడి సెంటర్‌లో 2కే రన్‌ను ప్రారంభిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ మట్టి గణనాథులను పూజించాలని కాకినాడ డీఎస్పీ బసవ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఆదివారం ఆల్ఫాబెట్ ఎడ్యుకేషనల్ హబ్, బ్రాండ్‌బజ్ ఆధ్వర్యంలో ఎకో ఫ్రెండ్లీ గణేష్ ఉత్సవ్- 2023 పేరిట 2కే రన్ నిర్వహించారు. దీనిని డీఎస్పీ శ్రీనివాస్, కాకినాడ డీఎస్ఏ ముఖ్య శిక్షకుడు శ్రీనివాస్ కుమార్, రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు ప్రారంభించారు. స్థానిక భానుగుడి సెంటర్ నుంచి డీఎస్ఏ వరకు ఈ రన్ సాగింది. డీఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రకృతి పరిరక్షణ ప్రతి పౌరుని బాధ్యతన్నారు. మట్టి వినాయకుని ప్రతిమల వినియోగంతో జల కాలుష్యాన్ని నివారించవచ్చన్నారు. ఆల్ఫాబెట్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కొప్పిశెట్టి రేవంత్ మౌనిక మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్న వారికి ధన్యవాదాలు తెలిపారు. రిలయన్స్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఎస్ఎల్ శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ స్టార్ సభ్యులు మూర్తి, నాగిని తదితరులు పాల్గొన్నారు. అనంతరం భానుగుడి సెంటర్‌లో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు.

మట్టి ప్రతిమల పంపిణీ

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో కోరమాండల్ మహిళా క్లబ్ ఆధ్వర్యంలో వినాయక చవితి పండగను పురస్కరించుకుని మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కోరమాండల్ మహిళా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి, లక్ష్మీ సృజన, పద్మావతి, మోహిని కుమారి, రవిశంకర్ పట్నాయక్, అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు. సర్పవరం జంక్షన్‌లో లయన్స్‌క్లబ్ కాకినాడ విజన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షురాలు ఎం.ప్రసూన, శ్రీవాణి, శ్రీదేవి రెడ్డి, మీనాక్షి, రమా సుందరి తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతులే మేలు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని లయన్స్ క్లబ్ ప్రొఫెషనల్ ఆధ్వర్యంలో 1,500 వినాయక మట్టి ప్రతిమలను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ జిల్లా గవర్నర్ సూర్యనారాయణ మాట్లాడుతూ మన భారతీయ సంస్కృతిలో గణపతి పూజ ఎంతో విశిష్టమైందన్నారు. ఏ కార్యక్రమానికైనా తొలి పూజ గణపతికేనని అన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం లయన్స్ క్లబ్ ప్రొఫెషనల్ ఏడేళ్లుగా కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా లయన్స్ రవికుమార్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నామన్నారు. డాక్టర్ అడ్డాల సత్యనారాయణ, జోనల్ చైర్మన్ ద్వారంపూడి విపుల్, లయన్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు, లయన్ మోహన్‌రావు, లయన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలాజీచెరువు: ప్లాస్టిక్ నిషేధానికి స్వచ్ఛంద సంస్థల కృషి అభినందనీయమని నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖాధికారి పృథ్వీచరణ్ అన్నారు. ధరిత్రి రక్షితి ఆధ్వర్యంలో భానుగుడి, సర్పవరం జంక్షన్, జగన్నాథపురం, దేవాలయం వీధి ప్రాంతాల్లో ఉచితంగా మట్టి వినాయక ప్రతిమలు, వస్త్ర సంచులు పంపిణీ చేశారు. సమితి అధ్యక్షురాలు సీమకుర్తి సురేఖ, సభ్యుడు ఎస్.మురళీకృష్ణ పాల్గొన్నారు. ఐడియల్ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ శ్రీకాంత్ విద్యుత్ నగర్‌లో మట్టి ప్రతిమలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మంత్రి వేణుగోపాలకృష్ణలకు గీతమ్ ప్రిన్సిపాల్ సురభిశారద ఆధ్వర్యంలో విద్యార్థులు వినాయక మట్టి ప్రతిమలు అందజేశారు.



మట్టి వినాయక ప్రతిమల పంపిణీలో పృథ్వీచరణ్, సీమకుర్తి సురేఖ



రమణయ్యపేటలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ